సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 2 । ఏప్రిల్ । 2025



గొర్రెల మందపై కుక్కల దాడి

వీధి కుక్కలు మందపై దాడి చేయడంతో 21 గొర్రెలు మృతి చెందగా మరో తొమ్మిది గాయపడ్డాయి.

8లో▸



ఆన్‌లైన్ మానిటరింగ్

గోదావరి తాగునీటి పథకంలో భాగంగా కొండపాక పంపింగ్ స్టేషన్‌ను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించారు.

8లో▸



పోలీస్..గో బ్యాక్!

'పోలీస్ గో బ్యాక్... సీఎం డౌన్ డౌన్' అంటూ విద్యార్థుల నినాదాలతో హెచ్‌సీయూ క్యాంపస్ దద్దరిల్లింది.

8లో▸

న్యూస్‌రీల్

వెల్‌డన్ కృతిక



కృతికను అభినందించి జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: గ్రూప్–1లో రాష్ట్ర స్థాయి 5వ ర్యాంకు సాధించిన మీర్‌పేట జిల్లెలగూడకు చెందిన సిద్దాల కృతికను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె కృతిక ఇంటికి వెళ్లి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నతమైన పదవి చేపట్టి ప్రజలకు సేవ చేయబోతుండటం గర్వకారణమని అన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ నాయకులు అర్కల భూపాల్‌రెడ్డి, సిద్దాల బీరప్ప, అర్కల కామేశ్ రెడ్డి, జటావత్ శ్రీనునాయక్, బొక్క రాజేందర్‌రెడ్డి, అనిల్‌యాదవ్, సిద్దాల అంజయ్య, సిరూర్ బాల్‌రాజ్ ఉన్నారు.

గ్రూప్-1 ఫలితాల్లో సత్తా



తల్లిదండ్రులతో పన్నిరాజ్

మాడ్గుల: గ్రూప్–1 ఫలితాల్లో మండలంలోని జైరాం తండాకు చెందిన వర్త్య పన్నిరాజ్ 495.5 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 64వ ర్యాంకు సాధించాడు. మండలంలోని జైరాం తండాకు చెందిన వర్త్య నీలా, దేవిలాల్ కుమారుడైన పన్నిరాజ్ వరంగల్‌లో బీటెక్ ఎన్‌ఐటీ పూర్తి చేసి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో ఉద్యోగం సాధించాడు. గత సంవత్సరం గ్రూప్–1 కోసం సన్నద్ధమై పరీక్షల్లో 64వ ర్యాంకు సాధించాడు. పన్నిరాజ్ తల్లి గృహిణి, తండ్రి ఎలక్ట్రీషియన్. గ్రూప్–1లో ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందని, ఈ విజయాన్ని తల్లిదండ్రులకు అంకితం ఇస్తున్నట్లు పన్నిరాజ్ తెలిపారు.

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



షాబాద్ పోలీస్‌స్టేషన్ వద్ద సీపీఐ నేతలు

షాబాద్: ప్రభుత్వం హెచ్‌సీయూ భూములను అమ్మడానికి కుట్ర చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆరోపించారు. షాబాద్‌లో మంగళవారం సీపీఐ నాయకుల అరెస్టులను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి సంఘం నాయకులను రాత్రికి రాత్రే అరెస్టు చేసి నిర్బంధించడం దుర్మార్గమని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యమాలు చేయకుండా నిర్బంధం విధించడం.. హైదరాబాద్ యూనివర్సిటీ 400 ఎకరాల భూమిని లాక్కొని విక్రయించాలని చూడడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రజల ఆస్తులు మ్ముకోవడమేనా ప్రజా ప్రభుత్వం అంటే అని నిలదీశారు. గత ప్రభుత్వం సర్కారు భూములు, ప్రజల ఆస్తులను అమ్మినందుకు ప్రజలు తగిన విధంగా గుణపాఠం చెప్పారని గుర్తు చేశారు. నిర్బంధాలు, పోలీసులతో ఉద్యమాలను ఆపలేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నక్కలి జంగయ్య, నాయకులు రఘురాం, నారాయణ, మధు, శ్రీశైలం, రాములు, శేఖర్, రామకృష్ణ, పాండు, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై బద్రీ నారాయణుడు



సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుడు

కొడంగల్: సూర్యదేవ నమో నమః అంటూ భక్తులు పరవశించిపోయారు. మంగళవారం ఉదయం పద్మావతీ సమేత శ్రీనివాసుడు సూర్యప్రభ వాహనంపై ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన వాహనంపై స్వామివారు బద్రీ నారాయణమూర్తిగా పూజలు అందుకున్నారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామివారు గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.



ఇబ్రహీంపట్నంలోని ఓ రేషన్‌షాపు వద్ద లబ్ధిదారుల క్యూ

పేదింటికి.. సన్నబియ్యం

జిల్లాలో అట్టహాసంగా ప్రారంభమైన పథకం

- రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారుల క్యూ
- ఉదయం నుంచే సందడి వాతావరణం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన్నబియ్యం పథకం మంగళవారం జిల్లాలో ప్రారంభమైంది. ఉదయం నుంచే రేషన్ దుకాణాల వద్ద సందడి మొదలైంది. కొన్ని షాపుల వద్ద కొబ్బరిమట్టలు.. మామిడి తోరణాలు.. పూలదండలు కట్టి.. కొబ్బరికాయలు కొట్టి అట్టహాసంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి రోజు విశేష ఆదరణ లభించింది. లబ్ధిదారులు బియ్యం తీసుకునేందుకు ఉత్సాహం చూపారు. పలుచోట్ల బారులు తీరి కనిపించారు. ఇన్ని రోజులు నాణ్యత లేని దొడ్డు బియ్యం తినలేకపోయామని.. బయటి దుకాణాల్లో కొనుగోలు చేసేవారమని.. ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయడం బాగుందని పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఆమనగల్లులో..

నిజంగా వరమే..



పేదోళ్లకు సన్న బియ్యం పంపిణీ నిజంగా వరమే. స్టాక్ అయిపోతే కష్టమని క్యూలో నిలబడ్డాం. మొన్నటి వరకు ఇచ్చిన దొడ్డు బియ్యంతో వండిన అన్నం తినాలనిపించేదికాదు. సన్న బియ్యం ఇస్తుంటే సంతోషంగా ఉంది. ప్రతీ నెల ఇలాగే ఇవ్వాలి.

– స్వరూప, ఇబ్రహీంపట్నం

నిరుపేదలకు ఆసరా



పేద, మధ్య తరగతి కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ ఆసరాగా నిలుస్తుంది. నేను కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటాను. ఇంతకు ముందు పంపిణీ చేసిన దొడ్డు బియ్యం అన్నం తినలేక పోయేవాళ్లం. ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున నలుగురికి కలిపి 24 కిలోలు వస్తాయి. డబ్బులు ఆదా అవుతాయి.

– వెంకటేశ్, ఇబ్రహీంపట్నం

బియ్యం బాగున్నాయి



ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం అందించడం మంచి పరిణామం. బియ్యం కూడా చాలా బాగున్నాయి. ఈ పథకాన్ని కొనసాగిస్తే బాగుంటుంది.

– శారద, వెంకటేశ్వర కాలనీ, ఆమనగల్లు

గుర్తుంచుకుంటాం



మాలాంటి పేదలకు సన్న బియ్యం అందించడం చాలా సంతోషం. ఎప్పటికీ ఇలాగే అందించాలి. పేదల బాధను అర్థం చేసుకుని సన్న బియ్యం అందించడం ఎప్పటికీ గుర్తుంచుకుంటాం.

– ఎర్రోళ్ల పెంటమ్మ, కడ్తాల్



కడ్తాల్: రేషన్ షాపు వద్ద క్యూలో లబ్ధిదారులు

బయట కొనే బాధ తప్పింది



రేషన్ షాపుల ద్వారా ఇప్పటి వరకు సరఫరా చేసిన దొడ్డు బియ్యం తినలేక కేవలం పిండివంటలు, ఉదయం వేళల్లో అల్పాహారానికే ఉపయోగించే వాళ్లం. బయట షాపుల్లో సన్నబియ్యం రూ.50 కిపైగా వెచ్చించి కొనుగోలు చేయాల్సి వచ్చేది. సన్న బియ్యం పంపిణీ చేపట్టడం బాగుంది.

– హీరాలాల్, లబ్ధిదారుడు, కందుకూరు

ఆనందంగా ఉంది



పేద ప్రజల మనస్సును అర్థం చేసుకుని, రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇవ్వడం ఆనందంగా ఉంది. నిరుపేదల కోసం ప్రభుత్వం ఇలాంటి పథకాలను అందించాలి.

– సిద్ధిగారి జంగమ్మ, కడ్తాల్

అభినందనీయం



పేద ప్రజల గురించి ఆలోచన చేయడం బాగుంది. నాణ్యమైన ఆహారం అందించాలన్న సంకల్పం అభినందనీయం. ప్రతి పేదవాడికి ఇక నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం అందడం సంతోషకరమైన విషయం.

– కిష్టమ్మ, లబ్ధిదారు, కొత్తూరు

మొదటిసారి పంపిణీ



గతంలో దొడ్డు బియ్యం మాత్రమే వచ్చేవి. రేషన్ దుకాణాల ద్వారా మొదటిసారి కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. ప్రస్తుతం సన్న బియ్యం పంపిణీతో అర్హులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– భాస్కర్, రేషన్ డీలర్, కొత్తూరు



ఇబ్రహీంపట్నం రూరల్: ఉప్పరిగూడలో రేషన్ దుకాణానికి కొబ్బరిమట్టలు, మామిడి తోరణాలు కట్టి పంపిణీ ప్రారంభం

ఎంతో ఉపయోగకరం



పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం అందించటం మంచి పరిణామం. బయట మార్కెట్‌లో ఎక్కువ ధరలు పెట్టి కొనాల్సి వస్తోంది. అవే రేషన్ దుకాణంలోనే వస్తుండటంతో పేదలకు మేలు జరగటంతోపాటు అందరూ తినటానికి ఉపయోగించుకుంటారు. ఇచ్చే బియ్యం బాగుండాలి.

– మంజుల, చేవెళ్ల

సంతోషంగా ఉంది



ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసిన సన్న బియ్యం చాలా బాగున్నాయి. మొదటి రోజే తీసుకుని వండుకుని తిన్నాం. ఎంతో తృప్తి అనిపించింది.

– వెంకటేశ్, చటాన్‌పల్లి, షాద్‌నగర్



కొత్తూరు: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతులమీదుగా సంతోషంగా సన్నబియ్యం అందుకుంటున్న లబ్ధిదారులు

మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పించండి

రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, కేసీ వేణుగోపాల్‌కు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల వినతి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ జరగనుందన్న వార్తల నేపథ్యంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలకు కేబినెట్‌లో అవకాశం కల్పించాలని రంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్‌కు వినతిపత్రాలు అందజేశారు. జాతీయ నేతలను కలిసిన వారిలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, పరిగి ఎమ్మెల్యే డా.టి.రామ్మోహన్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి ఆరుగురు మంత్రులు నియమితులయ్యారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ కీలకమైన జిల్లాల నుంచి మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం లేదని వెల్లడించారు. హైదరాబాద్, రంగారెడ్డి కలిపి తెలంగాణ జనాభాలో 42 శాతం ఉన్నారని ఈ వినతిలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమకు ప్రాతినిధ్యం లేకపోవడంతో అభివృద్ధి, పాలనాపరమైన సమస్యలను పరిష్కరించడంలో గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించకపోతే ప్రజల సంక్షేమాన్ని ప్రభావితం చేయడమే కాకుండా తెలంగాణ పురోగతిపై, ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ స్థితిపై విస్తృత ప్రభావాలు ఉండొచ్చని చెప్పారు. 2026లో జరగనున్న డీలిమిటేషన్‌తో, హైదరాబాద్, రంగారెడ్డిలో ఎమ్మెల్యేల సీట్ల సంఖ్య 44కి, ఎంపీ సీట్ల సంఖ్య 8కి పెరుగుతుంది.. కావున ఈ జిల్లాల్లో తమ ఉనికిని బలోపేతం చేయడం అవసరమన్నారు. అంతేకాకుండా ఈ ఏడాది చివర్లో జీహెచ్‌ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నందున ఈ జిల్లాల నుంచి మంత్రివర్గ ప్రాతినిధ్యం కాంగ్రెస్ పార్టీ అవకాశాలను బలోపేతం చేస్తుందని, తమ ఎన్నికల పనితీరును మెరుగుపరుస్తుందని సూచించారు.



ఖర్గేకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు

కాంగ్రెస్ వచ్చాక నేరాలు పెరిగాయి

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి

మీర్‌పేట: పహాడీషరీఫ్‌లో విదేశీ యువతిపై అత్యాచార ఘటన బాధాకరమని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి అన్నారు. మీర్‌పేట మిథులానగర్‌లోని స్నేహితుడి ఇంట్లో ఉంటున్న జర్మనీకి చెందిన యువతిని మంగళవారం ఆమె పరామర్శించి మాట్లాడారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలపై ఆసక్తి పెంచుకుని నెల రోజుల క్రితం యువతి దేశానికి రావడం జరిగిందన్నారు. నెల రోజుల పాటు ఎన్నో జ్ఞాపకాలు తనవెంట తీసుకెళ్దామనుకునే లోపే ఇలాంటి చేదు అనుభవం కలిగిందన్నారు. రాష్ట్రంలో ప్రతి గంటకు ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, తాజాగా నాగర్‌కర్నూలు జిల్లాలో ఆలయానికి వచ్చిన వివాహితపై, ఎంఎంటీఎస్ రైలులో యువతిపై లైంగిక దాడులు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాతబస్తీ లాంటి ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, పోలీసులు పెట్రోలింగ్ కూడా సరిగ్గా చేయడం లేదని ఆరోపించారు. విదేశీ యువతి ఘటనలో ఫొటోలు, వీడియో రికార్డింగ్‌ల వంటి ఆధారాలన్నీ ఉన్నప్పటికీ పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆమె ప్రశ్నించారు. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో 22 శాతం నేరాలు పెరిగాయని దుయ్యబట్టారు. హైదరాబాద్ లాంటి మెట్రోపాలిటన్ సిటీలో ఇంత పోలీసు వ్యవస్థ ఉన్నప్పటికీ మహిళలపై లైంగిక దాడులు, వేధింపులు, గృహహింసలు పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ముఖ్యమంత్రి వెంటనే చర్యలు తీసుకుని నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శిల్పారెడ్డి వెంట బీజేపీ నాయకులు అందెల శ్రీరాములు యాదవ్, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, గాజుల మధు, భిక్షపతిచారి, ముఖేష్ ముదిరాజ్, రవినాయక్, రాజు, నీలార వినాయక్ తదితరులు ఉన్నారు.



బాధిత విదేశీ యువతిని పరామర్శించేందుకు వచ్చిన శిల్పారెడ్డి, స్థానిక నేతలు

నేడు మరోసారి సిట్ ముందుకు శ్రవణ్‌రావు

బంజారాహిల్స్: ఫోన్ ట్యాపింగ్ నిందితుడు శ్రవణ్‌రావును సిట్ మరోసారి విచారించనుంది. ఈ మేరకు బుధవారం సిట్ ముందు విచారణకు హాజరుకావాలని శ్రవణ్‌రావుకు జూబ్లీహిల్స్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల క్రితం శ్రవణ్‌రావు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరుకాగా ఆ రోజు 6 గంటలు ప్రశ్నించినా పోలీసులకు సమాధానం లభించలేదు. దీంతో మరోసారి విచారణకు హాజరుకావాలంటూ తాజాగా సోమవారం నోటీసులు జారీ చేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు తమ ఎదుట హాజరుకావాలని పేర్కొన్నారు. ఈసారి సిట్ బృందం ముందస్తుగానే శ్రవణ్‌రావును అడిగే 75 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని రూపొందించింది. ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం దొరికితే దాదాపు ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక వ్యక్తుల పాత్ర వెలుగుచూస్తుందని, ఆ మేరకు ముందుగానే ప్రశ్నలు రూపొందించుకున్నారు. మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, మాజీ ఎస్‌ఐబీ డీఎస్పీ ప్రణీత్‌రావుతో ఉన్న పరిచయాలపై మూడు రోజుల క్రితమే అడిగినా శ్రవణ్‌రావు సరైన సమాధానం చెప్పలేదు. ఈసారి ఇదే ప్రశ్నలను లేవనెత్తి సమాధానాలు రాబట్టాలని చూస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ పరికరాలు ఎక్కడి నుంచి తెచ్చారు.. మీకు ఎందుకింత ఇంట్రెస్ట్, మిమ్మల్ని ఉసిగొల్పింది ఎవరు, మీ వెనుక ఉన్న రాజకీయ నేతలు ఎవరన్న ప్రశ్నలు అడగడానికి సిద్ధమవుతున్నారు. ఈసారి కూడా సమాధానాలు రాకపోతే మరోసారి విచారణకు పిలవాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మొత్తానికి శ్రవణ్‌రావును విచారించడం ద్వారా ఇటు మాజీ పోలీస్ బాస్‌లు, అటు ప్రభుత్వంలో కీలక నేతల వివరాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

గొర్రెల మందపై కుక్కల దాడి

- 21 జీవాల మృత్యువాత
- తొమ్మిదింటికి గాయాలు



సురంగల్‌లో మందపై వీధికుక్కలు దాడిచేయడంతో మృతి చెందిన గొర్రెలు

మొయినాబాద్: వీధి కుక్కలు మందపై దాడి చేయడంతో 21 గొర్రెలు మృతి చెందగా మరో తొమ్మిది గాయపడ్డాయి. ఈ సంఘటన మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం సురంగల్‌కు చెందిన జవ్వోజి రవియాదవ్ వ్యవసాయంతోపాటు పాడి గేదెలు, గొర్రెలను పెంచుతున్నాడు. రోజూ మాదిరిగానే సోమవారం రాత్రి జీవాలను దొడ్డిలో పెట్టి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో మెలకువ రావడంతో.. దొడ్డి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించాడు. గొర్రెల మంద వద్ద ఉన్న పెంపుడు కుక్కతో పాటు జీవాల అరుపులు వినిపించడంతో పొలం వద్దకు పరుగులు పెట్టాడు. రవి అరుపులు విన్న కుక్కలు అక్కడినుంచి పారిపోయాయి. వీటి దాడిలో చనిపోయిన గొర్రెల విలువ రూ.3 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

ఇద్దరు మహిళలకు గాయాలు

చేవెళ్ల: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా ఇద్దరు మహిళలు స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. చేవెళ్లకు చెందిన ఎరుకలి సాయికుమార్(35) తన భార్య దివ్య, చెల్లెలు దీపకతో కలిసి మంగళవారం మధ్యాహ్నం బైక్‌పై శంకర్‌పల్లి మండలంలోని చందిప్ప ఆయానికి వెళ్తున్నారు. గొల్లపల్లి సమీపంలో అతివేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. దీంతో ముగ్గురూ ఎగిరి కిందపడ్డారు. సాయికుమార్‌కు తలకు బలమైన గాయం కావడంతో అంబులెన్స్‌లో చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. దివ్య, దీపిక స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూలీ అదృశ్యం



రాజేష్ (ఫైల్)

కేశంపేట: బతుకు దెరువు కోసం ఇతర రాష్ట్రం నుంచి వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మంగళవారం మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు రాజేష్ తన అన్న రాజుతో కలిసి మూడు నెలల క్రితం మండలంలోని నిర్దవెళ్లి గ్రామంలో ఉన్న పౌల్ట్రీ ఫాంలో పని చేసేందుకు వచ్చారు. గత మార్చి 22న రాజేష్ పని చేసే ప్రదేశం నుంచి బ్యాగ్ తీసుకొని వెళ్లి నేటికీ తిరిగి రాలేదు. ఈ మేరకు అతడి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నరహరి తెలిపారు. అయితే రాజేష్ గతంలో ఓ యువతిని ప్రేమించి విఫలం అయి, మానసిక పరిస్థితి బాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలి

నేడు రాష్ట్ర వ్యాప్త నిరసనలకు సీపీఎం పిలుపు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

రాయదుర్గం: హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. పోలీసుల, ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేకంగా బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు పిలుపు ఇస్తున్నట్లు తెలిపారు. మంగళవారం హెచ్‌సీయూ వద్ద నిరసనలకు సంపూర్ణ మద్దతు ఇచ్చామన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పోలీసుల దౌర్జన్యాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చిందన్నారు. వేలం ప్రక్రియను వ్యతిరేకిస్తున్న విద్యార్థులపై ప్రభుత్వం దమనకాండకు పాల్పడుతుందని ఆరోపించారు. భవిష్యత్తు తరాల కోసం ఆందోళన చేస్తుంటే వారిపై అక్రమ కేసులు బనాయించి నవీన్ అనే ఎస్ఎఫ్ఐ నాయకుడిని జైలుకు పంపడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 430 మంది కార్యకర్తలు, నాయకులను అరెస్ట్ చేశారని, క్యాంపస్‌లో క్లాసులు జరిగే పరిస్థితి లేదని, పోలీసులు అక్కడ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారన్నారు. 144 సెక్షన్ విధించి ఎలాంటి నిరసనలు చేయకుండా అడ్డుకుంటున్నారన్నారు. యూనివర్సిటీ భూములను, అడవులను బుల్డోజర్లతో చదును చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం 400 ఎకరాల భూమి వేలం ఆపాలని డిమాండ్ చేశారు.

ఉరేసుకుని బాలుడి ఆత్మహత్య



సిద్ధార్థ (ఫైల్)

మంచాల: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ బాలుడు ఫ్యాను కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని ఆగాపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. మంచాల పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొర్ర సిద్ధార్థ(16) ఇబ్రహీంపట్నంలోని రెసిడెన్సియల్ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. మూడు నెలలుగా స్కూల్‌కు వెళ్లడం లేదు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు పెట్టుకొని చీరతో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. మధ్యాహ్నం సమయంలో కుటుంబ సభ్యులు వచ్చి చూడాగా తలుపు తీయలేదు. బద్దలు కొట్టి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ ఫొటో కూడా తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, బాడీని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మట్టి ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

కేశంపేట: అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న సంఘటన మండల పరిధిలోని కాకునూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం పెట్రోలింగ్‌లో విధుల్లో ఉన్న పోలీసులు కాకునూర్ గ్రామ శివారులో మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను గుర్తించారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తుండడంతో వాటిని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నరహరి తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

తలకొండపల్లి: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తలకొండపల్లికి చెందిన చెన్నోజి కూలీ పనులు చేసుకుంటు జీవించేవాడు. గత నెల 28న ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయాడు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో అతడి కుమారుడు మధుకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మంగళవారం ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

నీటి సరఫరాపై ఆన్‌లైన్ మానిటరింగ్

- ప్రతి చుక్కా లెక్కించడానికి ఫ్లో మీటర్ ఏర్పాటు
- కొండపాక స్టేషన్‌ను పరిశీలించిన ఎండీ



కొండపాక పంపింగ్ స్టేషన్ వద్ద అధికారులను సూచనలు ఇస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: మహా నగరానికి తాగునీటిని అందిస్తున్న గోదావరి తాగు నీటి సరఫరా పథకంలో భాగంగా కొండపాక పంపింగ్ స్టేషన్‌ను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మంగళశారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకుని నగరానికి నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంపింగ్‌కు అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముర్మూర్ వద్ద ఇన్ లెట్ నుంచి నగరానికి సరఫరా, ట్రాన్స్ మిషన్ తదితర వివరాలకు సంబంధించిన ఆన్‌లైన్ మానిటరింగ్ సిస్టమ్(స్కాడా)ను వంద శాతం వినియోగం కోసం ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఎల్లంపల్లి నుంచి నగరానికి సరఫరా చేసే ప్రతి చుక్కా లెక్కించడానికి ఫ్లో మీటర్ ఏర్పాటు చేసి.. ఆ వివరాలు ప్రధాన కార్యాలయంలో పర్యవేక్షించేందుకు మీటరింగ్ వ్యవస్థను కూడా ఆటోమేషన్ చేయాలని అధికారులకు సూచించారు. అత్యవసర సమయంలో పంపులు రిపేర్లు.. కాలిపోయిన సందర్భంలో నీటి సరఫరా ఆటంకం ఏర్పడకుండా స్టాండ్ బై మోటార్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. పంపింగ్ స్టేషన్ పరిసరాల్లో గార్డెన్, సుందరీకరణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ట్రాన్స్మిషన్ జీఎం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు షిఫ్టుల్లో ట్యాంకర్ల సరఫరా

వాటర్ ట్యాంకర్ల పెండెన్సీ తగ్గించేందుకు రెండు షిఫ్టుల్లో సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. పగటి వేళల్లో గృహ అవసరాలకు, రాత్రి వేళ కమర్షియల్ అవసరాలకు ట్యాంకర్లను డెలివరీ చేయాలని సూచించారు. మంగళవారం టాంకర్ బుకింగ్.. డెలివరీలపై ఆయన జీఎంలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. వరుస సెలవులు, పండగల సందర్భంగా కొందరు టాంకర్ డ్రైవర్లు సెలవులపై వెళ్లడంతో కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ బుకింగ్ పెండెన్సీ పెరిగినట్టు గుర్తించామన్నారు. షేక్‌పేట్, షాపూర్‌నగర్, బుద్వేల్, ఆసిఫ్‌నగర్, ఎన్టీఆర్ నగర్, భవానీ నగర్, చిలకలగూడ, షాపూర్‌నగర్-2, మౌలాలీ, గాజులరామారం, ఎర్రగడ్డ, గచ్చిబౌలి-2, వెంగళరావునగర్, ఎల్లారెడ్డిగూడ, వెంకటగిరి ఫిల్లింగ్ స్టేషన్ లలో వందకు పైగా ట్యాంకర్ పెండెన్సీ ఉందని తెలిపారు. పెండెన్సీలు క్లియర్ చేసేందుకు రానున్న రెండు రోజులు అదనపు గంటలు పని చేయడానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈడీ మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ.. ట్యాంకర్ డేటాను అనుసరించి ఏయే ఫిల్లింగ్ స్టేషన్ లలో, ఏయే సమయాల్లో బుకింగ్ అవుతున్నాయో అనాలసిస్ చేసుకుంటే పెండెన్సీ తగ్గించుకోవచ్చన్నారు. అవసరమైన ఫిల్లింగ్ స్టేషన్లలో ఫిల్లింగ్ పాయింట్స్ పెంచుకోవచ్చని అందుకు ప్రతిపాదనలు అందజేయాలని ఆదేశించారు.

జైళ్ల శాఖకు స్కోచ్ అవార్డు

చంచల్‌గూడ: ఢిల్లీలో ఇటీవల జరిగిన స్కోచ్ సంస్థ సమ్మిట్‌లో తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ విశేష సేవలు, సంస్కరణలకు గాను అవార్డు సాధించింది. శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా స్కోచ్ సంస్థ చైర్మన్ సమీర్ కొచ్చర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. జైళ్ల శాఖ చేపట్టిన ఖైదీల పునరావాసం, ఉద్యోగ కల్పన, కౌన్సెలింగ్, సామాజిక ప్రవేశం తదితర అంశాలను పరిగణిస్తూ ఈ అవార్డుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో డీఐజీ సంపత్ పాల్గొన్నారు.

గొడవల నేపథ్యంలో.. సోదరుడిని బైక్‌తో ఢీకొట్టి..

బంజారాహిల్స్: పాత గొడవల నేపథ్యంలో వరుసకు సోదరుడు అయిన ఓ వ్యక్తిని హోండా బైక్‌తో ఢీకొట్టి తీవ్రంగా గాయపరిచిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-5లోని దేవరకొండ బస్తీకి చెందిన కారు డ్రైవర్ ఉపేందర్ బస్తీలోని రాయల్ ఫుడ్ కోర్టు సమీపంలో నిలుచుని ఉన్నాడు. అదే సమయంలో అటుగా వచ్చిన అతడి వరుసకు సోదరుడైన నరేష్ బైక్‌తో ఉపేందర్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఇరువురి మధ్య గతంలో గొడవలు జరిగాయని దానిని మనస్సులో పెట్టుకుని బైక్‌తో ఢీ కొట్టినట్లు బాధితుడు తెలిపాడు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి మంగళవారం తీర్పు చెప్పారు. కోర్టు ఏపీపీ రఘు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చైతన్యపురి ఠాణా పరిధిలోని ద్వారకాపురి కాలనీకి చెందిన బాలిక(5) అదే ప్రాంతంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతుండేంది. 2023 ఫిబ్రవరి 22న ఆమె తల్లి వారి పక్క ఇంట్లో నివాసం ఉంటున్న కాసర్ల మహేశ్ (19) వద్ద బాలికను వదిలేసి పనికోసం వెళ్లింది. కొద్ది సేపటికి ఇంటికి తిరిగి వచ్చి చూడగా మహేష్ బాలికపై లైంగిక దాడికి పాల్పడుతున్నట్లు గుర్తించింది. ఈ విషయమై అతడిని నిలదీయగా ఆమెపై దాడి చేశాడు. దీంతో బాధితురాలి తల్లి చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయస్థానం మంగళవారం నిందితుడికి పై విధంగా శిక్ష ఖరారు చేస్తూ తీర్పు చెప్పింది. బాధితురాలికి రూ. 5లక్షల నష్ట పరిహారం చెల్లించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు సిఫార్సు చేసింది.

పోలీస్..గో బ్యాక్!

విద్యార్థుల నినాదాలతో హోరెత్తిన హెచ్‌సీయూ

- కొనసాగిన ఆందోళనలు
- ఆ భూములను యూనివర్సిటీకే అప్పగించాలని డిమాండ్



హెచ్‌సీయూలో పోలీసుల పహారా

గచ్చిబౌలి/రాయదుర్గం: 'పోలీస్ గో బ్యాక్ ... సీఎం డౌన్ డౌన్' అంటూ విద్యార్థుల నినాదాలతో హెచ్‌సీయూ క్యాంపస్ దద్దరిల్లింది. మంగళవారం కూడా వర్సిటీలో ఆందోళనలు కొనసాగాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ వర్సిటీ భూములను పరిరక్షిస్తామని వారు నినదించారు. పోలీసులను వెంటనే వర్సిటీ నుంచి పంపేయాలని డిమాండ్ చేశారు.

తరగతుల బహిష్కరణ

హెచ్‌సీయూ విద్యార్థి సంఘాల పిలుపుతో సామూహికంగా తరగతులను బహిష్క రించారు. దీంతో వర్సిటీలో ఎలాంటి తరగతులు జరగలేదు. వైవిధ్యాన్ని రక్షించాలని, భూములను అప్పగించాలని ప్లకార్డులతో రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పోలీసులకు క్యాంపస్‌లో ఏమి పని అని ప్రశ్నించారు. వెంటనే క్యాంపస్ నుంచి వారిని వెళ్లి పోయేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 400 ఎకరాలతో పాటు మొత్తం స్థలాన్ని యూనివర్సిటీ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ర్యాలీ అనంతరం మెయిన్ గేట్ వద్ద మహాధర్నా నిర్వహించారు.

సైబరాబాద్ ట్రాఫిక్‌లోకి ట్రాన్స్‌జెండర్లు

- వారం పాటు ఐదుగురు ట్రాన్స్‌జెండర్లకు శిక్షణ
- ఆ తర్వాత ఐటీ హబ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ విధులు

సాక్షి, సిటీబ్యూరో: ట్రాన్స్‌జెండర్లు కూడా సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో త్వరలోనే సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోనూ ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ పోలీసు విధులను చేపట్టనున్నారు. వారం రోజుల పాటు శిక్షణ అనంతరం ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ మార్షల్స్‌గా విధులు నిర్వహించనున్నారు. గతేడాది 97 మంది ట్రాఫిక్ మార్షల్స్‌ను ట్రాఫిక్ పోలీసులకు సహాయకులుగా నియమించిన సంగతి తెలిసిందే. వీరిలో ఇప్పటికే చాలా మంది హైదరాబాద్ ట్రాఫిక్ విభాగంలో పని చేస్తున్నారు. తాజాగా జరీనా, విశాలాక్షి, అనూష, ప్రభాస్, వాసుప్రియ సైబరాబాద్ ట్రాఫిక్ విభాగంలోకి రానున్నారు. శిక్షణ అనంతరం మాదాపూర్, రాయదుర్గం, నార్సింగి పరిసర ప్రాంతాల్లో వీరు ట్రాఫిక్ మార్షల్స్‌గా విధులు నిర్వహిస్తారు. కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు విధులు నిర్వర్తిస్తారు.

కౌన్సెలింగ్ తర్వాతే..

ట్రై కమిషనరేట్లకు చెందిన 45 మంది ట్రాన్స్‌జెండర్లు, ట్రాన్స్‌జెండర్ మహిళా ఉద్యమకారిణి చంద్రముఖి మువ్వలతో సైబరాబాద్ మహిళా భద్రతా విభాగం డీసీపీ సృజన ఇటీవల సమావేశం నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్లకు శిక్షణలో సాధారణ ట్రాఫిక్ మానిటరింగ్, ట్రాఫిక్ పోలీసులకు సహకారంతో పాటు మోటారు వాహన చట్టంపై అవగాహన కల్పిస్తారు. రిక్రూట్‌మెంట్ అనంతరం వారి పనితీరును మూడు నెలల పాటు సమీక్షిస్తారు. అప్పటివరకు ట్రాఫిక్ కానిస్టేబుల్‌లకు సహాయకులుగా ట్రాన్స్‌జెండర్ ట్రాఫిక్ మార్షల్స్ పనిచేస్తారు. ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ మార్షల్స్‌గా కొత్త జీవితాన్ని ఆరంభించడంలో కౌన్సెలింగ్ తప్పనిసరి. వారి గత జీవితాన్ని మర్చిపోయి, సమాజంలో గౌరవప్రదంగా నూతన జీవితాన్ని ప్రారంభించేందుకు వారిని మానసికంగా సిద్ధం చేసేందుకు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌన్సిలింగ్ సెంటర్ నిర్వాహకురాలు పింకీ గత 3-4 నెలలుగా వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు ఒత్తిడికి గురికాకుండా చూసేందుకు డిపార్ట్‌మెంట్ తరఫున కూడా పలువురు మనస్తత్వవేత్తలతో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ప్రతి ట్రాఫిక్ మార్షల్ నెలవారీ వేతనం రూ.18 వేలుగా ఉంటుంది. వీరి జీతభత్యాలను సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఐటీ, ఐటీఈఎస్ సంస్థలు స్పాన్సర్ చేస్తాయి.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలై ఓ ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన తపస్‌కుమార్ బెహరా సీఎంసీ కంపెనీలో టెక్నికల్ ఆపరేటర్‌గా పనిచేస్తూ బాలానగర్‌లో నివాసముంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో బైక్‌పై(టీఎస్ 08హెచ్‌బీ9004) వెళ్తుండగా సుచిత్ర మహీంద్రా షోరూం సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తపస్‌కుమార్ గాల్లో ఎగిరి రోడ్డుపై ఏర్పాటు చేసిన బారికేడ్లపై పడ్డాడు. అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి రైతు ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలు కిందపడి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. బీబీనగర్-ఘట్‌కేసర్ రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్న ఓ వ్యక్తి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్యహత్యకు పాల్పడినట్లు లోకో పైలట్ ద్వారా పోలీసులు సమాచారం అందుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్‌కు చెందిన రైతు కొండాల అశోక్‌గా గుర్తించారు. ఆర్థిక, కుటుంబ సమస్యల కారణంతో మనస్తాపానికి గురైన సూసైడ్ చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కుటుంబ కలహాలతో వలస కూలీ ఆత్మహత్య

కేశంపేట: వలస కూలీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని చిత్రకూట్‌కు చెందిన రాధేశ్యాం(42) తన కుటుంబంతో కలిసి తొమ్మిది నెలల క్రితం మండలంలోని వేములనర్వ గ్రామంలోని పవన్‌కుమార్‌కు చెందిన మామిడితోటలో పనులు చేసేందుకు కూలీలుగా వచ్చారు. భార్యాభర్తలు ఇరువురూ అక్కడే పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాధేశ్యాం తాగుడుకు బానిసై భార్య, పిల్లలను పట్టించుకోకపోవడంతో తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో అతడు గత నెల 31న రోజు రాత్రి మద్యం తాగి భార్యతో గొడవ పడి బయటికి వెళ్లాడు. తోటలోని ఓ చెట్టుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదే విషయమై మంగళవారం మృతుడి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లో అకౌంట్ హోల్డర్ అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: నగర వాసి నుంచి రూ.14.63 లక్షల కాజేసిన ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లో నిందితుడిని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నగరంలో ఉంటున్న ప్రైవేట్ ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు వాట్సాప్ ద్వారా ఎర వేశారు. తాము సూచించినట్లు ఇన్వెస్ట్‌మెంట్స్ చేస్తే కనీసం 20 శాతం లాభాలు ఉంటాయని నమ్మబలికారు. తొలి నాళ్లల్లో లాభాలు చూపించినా.. చివరకు బాధితుడి నుంచి రూ.14.63 లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదుతో సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. దీన్ని దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ కె.సతీష్‌రెడ్డి నేతృత్వంలోని బృందం కొంత మొత్తం యూపీలో ఉన్న బ్యాంకు ఖాతాలోకి వెళ్లినట్లు గుర్తించింది. అక్కడకు వెళ్లిన అధికారులు సదరు అకౌంట్ హోల్డర్ శివ శంకర్‌ను అరెస్టు చేసి తీసుకువచ్చారు. నోయిడాలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఇతడిపై మరో కేసు నమోదై ఉన్నట్లు గుర్తించారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

కేపీహెచ్‌బీకాలనీ: ప్రేమ విఫలమై మనస్తాపానికి గురైన ఓ యువకుడు సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్ధిపేట జిల్లా, ప్రశాంత్ నగర్‌కు చెందిన ఉప్పరపల్లి మహేందర్ (25) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అడ్డగుట్ట సొసైటీలోని హాస్టల్‌లో ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం హాస్టల్ గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడటంతో హాస్టల్ నిర్వాహకుడు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు కేపీహెచ్‌బీ పోలీసులకు సమాచారం అందించారు. ప్రేమలో ఓడిపోవడమే తన మరణానికి కారణమని రాసి ఉన్న లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపై పడిన సెల్‌ఫోన్ తీసుకుంటుండగా...

శామీర్‌పేట్: రోడ్డు పడిన సెల్ ఫోన్ తీసుకుంటుండగా కారు ఢీ కొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జినోమ్‌వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.సిద్దిపేట్ జిల్లా, మామిడ్యాల గ్రామానికి చెందిన పొట్ట ప్రవీణ్ (23), హైదరాబాద్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై రాజీవ్ రహదారి మీదుగా వెళుతుండగా తుర్కపల్లి గ్రామ సమీపంలో తన జేబులోంచి సెల్‌ఫోన్ రోడ్డుపై పడింది. దీంతో కిందపడిన సెల్‌ఫోన్‌ను తీసుకుంటుండగా అదే సమయంలో నగరం నుంచి వేగంగా వచ్చిన ఎర్టిగా కారు వెనక నుంచి అతడిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. జినోమ్ వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బులు అడిగితే చంపేస్తా..

వెంగళరావునగర్: అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలన్నందుకు ఓ వ్యక్తి ఓ వృద్ధురాలిని చంపుతానని బెదిరించిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎస్‌కెఎస్ రాజు, నరసమ్మ దంపతులు వెస్ట్ శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఉంటున్నారు. 2017లో వారి ఇంటి సమీపంలో నివాసం ఉండే హనుమంతరావు దుస్తుల వ్యాపారం నిమిత్తం వారి నుంచి రూ.14 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆ తర్వాత కొన్నాళ్లకే రాజు మృతి చెందాడు. అప్పటి నుంచి నరసమ్మ పలుమార్లు డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినా స్పందించడం లేదు. ఈ విషయమై నరసమ్మ అతడిని నిలదీయగా ఆమెను దుర్భాషలాడటమేగాక మరోసారి డబ్బులు అడిగేందుకు ఇంటికి వస్తే నిన్ను కూడా మీ ఆయన దగ్గరకు (చంపుతానని) పంపుతానని బెదిరించాడు. దీంతో బాధితురాలు మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.